కేసీఆర్ ఆనవాళ్లు.. అభివృద్ధి జాడలు

- సిద్దిపేట జిల్లాలో సిద్ధమైన కోకాకోలా ప్లాంట్
- 2022లో సీఎం కేసీఆర్ పాలనలో శంకుస్థాపన
- కేటీఆర్ అమెరికా పర్యటనలో కుదిరిన ఒప్పందం
- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): తెలంగాణ సమగ్రాభివృద్ధికి తొలి సీఎం కేసీఆర్ దార్శనికతతో ప్రణాళికలు రచించారు. ఇందులో భాగంగా పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. చాలా పరిశ్రమలు కార్యరూపం దాల్చగా కొన్ని ఇప్పటికీ అందుబాటులోకి వస్తున్నాయి. బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన పెట్టుబడులు క్రమక్రమంగా ఫలితాలిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో 49 ఎకరాల్లో రూ.1000కోట్లతో కోకాకోలా గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ ఏర్పాటుకు 2022 ఏప్రిల్‌లో ఆనాటి ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటనలో ఒప్పందం కుదిరింది. అమీన్‌పూర్‌లోని కోకాకోలా ప్లాంట్‌ను రూ.142కోట్లతో విస్తరించింది. రెండో ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. బండ తిమ్మాపూర్‌లో భారీ బాట్లింగ్ యూనిట్ నిర్మించింది. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసే నాటికి 400 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్లాంట్‌ను నేడు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించనున్నారు.

నేడు శ్రీనివాస్‌రెడ్డికి వీడ్కోలు సభ

హాజరుకానున్న హరీశ్‌రావు, మధుసూదనాచారి

హైదరాబాద్,డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా సుదీర్ఘ కాలం సేవలందించిన మాది రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు, మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హాజరుకానున్నారని పార్టీ నాయకులు వెల్లడించారు. పార్టీ నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఏకం

ప్రత్యేక రాష్ట్రం మాములుగా రాలేదు • ఎందరో త్యాగాల ఫలితంగా సిద్ధించింది

అమరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి • పోలీస్ కిష్టయ్య వర్ధంతి సభలో వక్తలు

సభలో మాట్లాడుతున్న అల్లం నారాయణ. చిత్రంలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 1 : మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష యావత్ తెలంగాణ సమాజాన్ని ఏకం చేసిందని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసిందని పలువురు వక్తలు స్పష్టంచేశారు. అమరుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా పోలీస్ కిష్టయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్మారకోపన్యాస సభ సీనియర్ జర్నలిస్టు పిట్టల రవీందర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు దాటినా ఇంకా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పూ రాలేదని చెప్పారు. దేశంలో తెలంగాణ ఉద్యమానికి ఓ చరిత్ర ఉన్నదని, ఆ చరిత్రను గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నదని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం మాములుగా రాలేదని, ఎందరో త్యాగాల ఫలితంగా సిద్ధించిందని స్పష్టంచేశారు. నాడు కేసీఆర్‌ను దారుణంగా అరెస్టు చేశారని, ఆ సందర్భంలో తెలంగాణ ఉద్యమం ప్రశ్నార్థకంగా మారిందని, ఇక మనకు దిక్కెవరన్న నిరాశ, నిస్పృహల నేపథ్యంలో మనుస్సులు చలించిన యువత ఆత్మ హత్యలకు పాల్పడిందని గుర్తుచేశారు. వారిలో పోలీసు కిష్టయ్య, శ్రీకాంతాచారి లాంటి ఎందరో యువకులు ఉన్నారని, తమ ఆత్మహత్యలతోనైనా పరిష్కారం లభిస్తుందేమోనని వారు భావించారని, అప్పుడు పరిష్కారం లేకనే ప్రాణత్యాగాలకు సిద్ధపడ్డారని చెప్పారు. తాను 'నమస్తే తెలంగాణ' ఎడిటర్‌గా పనిచేస్తున్న క్రమంలో మందమర్రిలో తెలంగాణ కోసం ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి ఉత్తరం చూస్తే ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన ఆకాంక్ష, ఆవేదన ఎంత ఉన్నదో అర్థమైందని, ఆత్మహత్యలకు పాల్పడిన వారెవరూ నిరక్షరాస్యులు కాదని, తెలంగాణ గురించి సరైన అవగాహన ఉన్నవారే చనిపోయారని తెలిపారు. నాటి అమానవీయమైన రాజకీయాల నేపథ్యంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణకు మద్దతుగా రాజీనామాలు చేయకుండా తప్పించుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ కోసం కేవలం యువతే కాదని, జర్నలిస్టులు సైతం అసువులు బాసారని ఆవేదన వ్యక్తంచేశారు.

అమరుల ఉత్తరాలే ఒక చరిత్ర

మలి ఉద్యమంలో అమరుల ఉత్తరాలే ఒక చరిత్ర అని, 1200 మంది బలిదానాలను చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన అవసరం ఉందని అల్లం నారాయణ స్పష్టంచేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం చావుకు ఎదురెళ్లిన వారిని తెలంగాణ వీరులుగా గుర్తించాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న వారిలో ఎక్కువగా బహుజనులే ఉన్నారని, పోరాటాన్ని రక్తంతో లిఖించేది కూడా ఆ వర్గాల వారేనని చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలే కాదు.. ఒక వివక్ష, పెత్తనం, వలస ఆధిపత్యానికి వ్యతిరేకంగా, మన భాష, యాసను వెక్కిరించిన నేపథ్యంలో పుట్టుకొచ్చిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఓ విపత్కర పరిస్థితి నెలకొన్నదని, బీసీల్లో అతిపెద్ద పెద్ద కమ్యూనిటీగా ఉన్న ముదిరాజ్‌లకు ఓ మంత్రి లేడని, ప్రస్తుతం పేదల భూములు లాక్కోవడం, జాగలు గుంజుకోవడం లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు.

ఉద్యమ ఆకాంక్షను పెంచిన దీక్ష

కేసీఆర్ ఆమరణ దీక్షకు ముందు 50 శాతం మంది ప్రజలే స్వరాష్ట్రాన్ని కోరుకున్నారని, వారిలో ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, వారి సంఘాలు, జర్నలిస్టులే ఉన్నారని, కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రజల్లో ఉద్యమ ఆకాంక్షను పెంచిందని, రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసిందని టీజీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. కేసీఆర్ దీక్షతోనే నూటికి నూరు శాతం మంది ప్రజలు ఉద్యమంలో కలిసి వచ్చారని గుర్తుచేశారు. 'ఆత్మహత్యలను సైకాలజిస్టులు మానసిక కుంగుబాటు, బలహీనతగా చెప్తుంటారు, మిగతా వర్గాలు అది పిరికి వారి చర్య అని, మరికొందరు పాపమని అంటుంటారు.. నేరపూరితమైందని చెప్తుంటారు.. కానీ ఓ ఫ్రెంచ్ మేధావి చెప్పినట్టుగా ఆత్మహత్య ఓ సాహసం.. ఒక సంఘీ భావం.. ప్రజలను కలిపేందుకు ఉపయోగపడే సాధనం.. ప్రజలను సంఘటిత పరిచేందుకు సామాజిక ప్రతి చర్య' అని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన ఆత్మహత్యలు క్షణికావేశం కాదని, కొన్ని తరాల దుఃఖాన్ని భరించలేక, తమ బలిదానాలతోనైనా రాష్ట్రం సిద్ధిస్తుందన్న బలమైన ఆకాంక్షతో ప్రాణత్యాగాలకు ఒడిగట్టారని గుర్తుచేశారు. పోలీస్ కిష్టయ్య సెల్ టవర్ ఎక్కిన ప్పుడు కొన్ని గంటల సేపు అక్కడి నుంచే మాట్లాడారని, వెనక్కి మాత్రం తిరిగి రాలేదని, తెలంగాణ వస్తుందన్న ఒక కృతనిశ్చయంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. 1200 మంది అమరులు ఒక ఆలోచనతో ఆత్మహత్య చేసుకున్నారని, వారి త్యాగాలను ఈ సమాజం మరిచిపోదని చెప్పారు. రిటైర్డ్ ఐజీ నరసింహ మాట్లాడుతూ దివంగత పోలీస్ కిష్టయ్యతో పాటు తెలంగాణ అమరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, వారి విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కిష్టయ్య సతీమణి పద్మ, కుమారుడు రాహుల్, ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షుడు ఉప్పరి నారాయణ ముదిరాజ్, యాదిగిరి ముదిరాజ్, సుమిత్ర పాల్గొన్నారు.

వీరుడా కిష్టయ్య జోహార్

'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోసం ప్రాణ త్యాగంచేసిన వీరుడా జోహార్' అని పోలీసు కిష్టయ్య వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీసు కిష్టయ్యకు ఆదివారం అశ్రునివాళులర్పించారు. 'నీ మరణం యావత్ తెలంగాణ సమాజంలో స్ఫూర్తిని రగిలించింది' అని ఎక్స్ వేదికగా ఆయన కొనియాడారు.

ఐఐటీ రామయ్య యోగక్షేమాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఐఐటీ రామయ్యను కలువడం ఆనందకరం

మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్

హైదరాబాద్, డిసెంబర్1 (నమస్తేతెలంగాణ): తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచిన, ఐఐటీనే తన ఇంటిపేరుగా మార్చుకున్న సరస్వతీ పుత్రుడు ఐఐటీ రామయ్యను కలుసుకోవడం ఆనందంగా ఉన్నదని హరీశ్‌రావు ఆదివారం ట్వీట్ చేశారు. 98 ఏండ్ల వయస్సులో కూడా రామయ్య సమాజం గురించి ఆలోచించడం గొప్పవిషయమని వెల్లడించారు. సిద్దిపేటతో ఆయనకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను తనతో పంచుకున్నారని చెప్పారు. రామయ్య నూరేళ్లకు పైబడి ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

రైతులను నిండుగా ముంచి రైతు సంబురాలా?

- దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన సీఎం రేవంత్
- ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొడితే ఊరుకునే ప్రసక్తే లేదు
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 1 : రేవంత్‌రెడ్డి బై డిఫాల్డ్ ముఖ్యమంత్రి అయ్యాడని, రెండురోజుల క్రితం మహబూబ్‌నగర్ సమావేశంలో ఫ్రస్ట్రేషన్, పరేషాన్‌లో ఏమేమో మాట్లాడారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతులను నిండా ముంచి రైతు పండుగ చేసుకోవటంలో అర్థం లేదని అన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని సర్వేలు చెబుతున్నాయని వెల్లడించారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, 420 వాగ్దానాలు ఇచ్చి ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హామీలు అమలు చేయలేక నిత్యం కేసీఆర్ మీద పడి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో రుణమాఫీ రైతులందరికీ కాలేదన్న సంగతి రుణమాఫీ కానీ రైతులకు తెలుసని చెప్పారు. ఎన్నికల సమయంలో 60 లక్షల మంది రైతులకు 40 రూ. వేల కోట్ల రుణమాఫీ అని అంచనా వేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో 24 లక్షల మంది రైతులకు కేవలం రూ. 20 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగిందని వివరించారు. ఇంకా 36 లక్షల మంది రైతులకు 20 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయాల్సి ఉందని తెలిపారు. ప్రతి రైతుకు రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ఎకరానికి ఎగ్గొట్టిన రూ.12 వేల బోనస్, రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుబంధును ఎగ్గొట్టే కుట్ర చేస్తుందనడానికి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొడితే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఇవ్వకపోతే ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అంతంచేస్తారని చెప్పారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఉంటే తాను రాజీనామా చేస్తానని, లేకపోతే రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు.

పోలీసు కిష్టయ్య భార్య పద్మావతితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కిష్టయ్య కుటుంబానికి ఎమ్మెల్సీ కవిత భరోసా

అండగా ఉంటామని హామీ • భావోద్వేగానికి లోనైన కవిత

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మలిదశ తెలంగాణ ఉద్యమ అమరవీరుడు పోలీసు కిష్టయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య పద్మావతి, కుమారుడు రాహుల్‌ను ఆదివారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా కవిత తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ కుమార్తె ప్రియాంక వైద్య విద్య కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆర్థిక సాయం చేసిన విషయాన్ని గుర్తు చేసిన పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారి కుటుంబాలను కేసీఆర్ అన్నివిధాలుగా అండగా నిలిచారని తెలిపారు. అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కవిత వెంట టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తనోబా తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు సమాధి కడదాం

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన రేవంత్ సర్కారు
- పార్టీ మారిన నాయకులకు పరాభవం తప్పదు
- భద్రాచలం ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- బీఆర్ఎస్ చర్ల మండల సమావేశంలో ఎమ్మెల్సీ మధు
- 'స్థానికం'లో శ్రేణులు శ్రమించాలి: రాష్ట్ర నేతలు రాకేశ్‌రెడ్డి, రేగా

భద్రాద్రి జిల్లా చర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి, పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

చర్ల, డిసెంబర్ 1: ఆరు గ్యారెంటీలను విస్మరించి ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధి కడదామని ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రేవంత్ సర్కారు తుంగలో తొక్కిందని విమర్శించారు. బీఆర్ఎస్ మండలం కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన చర్లలో ఆదివారం జరిగిన పార్టీ మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో తాతా మధు మాట్లాడారు. స్వార్థంతో పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పరాభవం తప్పదని స్పష్టం చేశారు. భద్రాచలం నియోజకవర్గానికి కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందని, అప్పుడు కూడా బీఆర్ఎస్ గెలుపు ఖాయమవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా బీఆర్ఎస్‌ని గెలిపించి.. పార్టీ మారిన వారికి, చేర్చుకున్న వారికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు శ్రమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

కడియం శ్రీహరిని తరిమికొట్టడం ఖాయం

- నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘనపురం, డిసెంబర్ 1: కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా గ్రామాల్లో తిరిగితే బీఆర్ఎస్ కార్యకర్తలు తరిమికొట్టడం ఖాయమని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హెచ్చరించారు. నిజాయితీ ఉంటే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి ఎన్నికల్లో గెలిచి అభివృద్ధి గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. జనగామ జిల్లా లింగాలఘనపురంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కడియం తన కూతురు భవిష్యత్ కోసం పార్టీ మారారాని విమర్శించారు. కాంగ్రెస్‌కు రూ.వంద కోట్లకు అమ్ముడుపోయి, ఆ డబ్బులతోనే కూతురును ఎంపీగా గెలిపించుకున్నారని ఆరోపించారు.

ప్రభుత్వం రేవంత్ జాగీరా?

- 20 లక్షలు నేనిస్తా అనడం ఏమిటి?
- మా ప్రభుత్వం ఇస్తుందని చెప్పాలి
- పాలమూరు సభతో రైతులకేం లాభం?
- 10 వేల రైతుబంధు ఇవ్వలేనిది.. 35 వేల కోట్ల బోనస్ ఇస్తరా?
- యాసంగిలో వరి వేయాలా? వద్దా?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నిలదీత

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో టీఎస్‌టీఎస్ మాజీ వైర్మన్ చిరుమళ్ల రాకేశ్

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రజల ప్రయోజనార్థం భూములు సేకరిస్తే పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, అంతే తప్ప పాలమూరు సభలో 10 లక్షలు కాకుంటే 20 లక్షలు నేనిస్తా.. అని రేవంత్‌రెడ్డి అనడం ఏమిటని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిలదీశారు. 'ప్రభుత్వం నుంచి ఇస్తామని చెప్పాలి గాని, ఇలా నేనే ఇస్తా అనడం అంటే ప్రభుత్వం ఏమైనా రేవంత్‌రెడ్డి జాగీరా? రాష్ట్రంలో భూసేకరణ చట్టం లేదా?' ధ్వజమెత్తారు. నిర్వాసితులకు నష్టపరిహారం పెంచే ప్రణాళిక ఏదైనా ఉంటే ప్రజలకు చెప్పాలని, పరిహారం పెంపు కేవలం కొడంగల్‌కేనా? రాష్ట్ర మంతా అమలుచేస్తారా? అనేది కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చేతకానితనం వల్ల వందల టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయని, ఇప్పుడు శ్రీశైలంలో 130 టీఎంసీలే ఉన్నాయని చెప్పారు. ఎండకాలంలో రైతులు వరి వేయాలా? వద్దా? నీళ్లు ఇస్తారా? ఇవ్వరా? అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పాలమూరులో రైతు పండుగ పేరుతో రేవంత్ సర్కారు నిర్వహించిన సభ కాంగ్రెస్ సభగా మారిందని మండిపడ్డారు.

సాయిరెడ్డి ఆత్మహత్యకు కారణం ఎవరు?

ప్రజాస్వామ్యం గురించి గొప్పగా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. సొంత ఊరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు కారణం ఎవరు? అని నిరంజన్‌రెడ్డి నిలదీశారు. 'సాయిరెడ్డి మరణం సందర్భంగా ఆంక్షలు విధించింది ఎవరు? కనీసం పరామర్శకు కూడా వెళ్లనివ్వలేదు.. ప్రజలు ఈ దారుణాలను మరిచిపోలేదు' అని మండిపడ్డారు. వలసలను ఆపి పాలమూరును బీఆర్ఎస్ ప్రభుత్వం పచ్చగా చేసిందని, రేవంత్‌రెడ్డి చదువుకున్నప్పుడు వలసల దుస్థితిని ఎదుర్కొన్నది కాంగ్రెస్ పాలనలోనే కదా? అని ప్రశ్నించారు. తన తండ్రి మరణిస్తే స్నానాలు చేయడానికి నీళ్లు లేవని చెప్పింది రేవంత్‌రెడ్డే కదా? అని నిలదీశారు. 'పులులు చూశా, నక్కలు చూశా అని రేవంత్‌రెడ్డి హూంకరిస్తున్నారు.. మీ వీరత్వం, ధీరత్వం పనుల్లో మాపించాలి' అని చురకలంటించారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా నీటిని ఒడిసిపట్టి ప్రాజెక్టులు, చెరువులు నింపడం చేతగాక వందల టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం కృష్ణానది నుంచి శ్రీశైలం ద్వారా తెలుగుగంగ, పోతిరెడ్డిపాడు ఎత్తిపోతలతో దాదాపు 400 టీఎంసీల నీటిని తీసుకువెళ్లిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెద్దఎత్తున నీళ్లు వచ్చినా ఈ యాసంగికి సాగు నీరు అందే పరిస్థితి లేదని, శ్రీశైలంలో ప్రస్తుతం 130 టీఎంసీలే ఉన్నాయని మరి భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకింద సాగు పరిస్థితి ఏమిటని, రైతు సంబురాలు చేసిన సీఎం యాసంగి పంటలు వేయాలా? వద్దా? రైతులకు ఎందుకు చెప్పి రాలేదు? అని నిలదీశారు. రాష్ట్రంలో 568 మంది రైతులు మరణించారని, వారి మరణాలకు కారకులెవరని నిలదీశారు.

> **పాలమూరు సభలో సీఎం తమకు ఏదైనా లబ్ధికలిగే విషయాలు చెప్తారేమోనని ఎదురుచూసిన ప్రజలు, రైతులకు ఒరిగిందేమిటి? లగచర్లలోని గిరిజన భూములే కావాల్నా? మిగతా చోట్ల వద్దా? ప్రభుత్వం ఎందుకు మంకుపట్టు పడుతున్నది? ఫార్మా కాకుంటే ఇంకో విధంగా తప్పకుండా భూములు లాక్కుంటామని గిరిజనుల మీద పడటం ఏమిటి? పాలమూరును ఉద్ధరించినట్టు మీ బిల్డప్పేమిటి?** – నిరంజన్‌రెడ్డి

35 వేల కోట్ల బోనస్ ఇస్తారా?

వడ్లకు బోనస్ విషయంలో రేవంత్ సర్కారు రైతులను మోసం చేస్తున్నదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. 'అధికారిక లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 40.55 లక్షల ఎకరాల్లో అంటే (61శాతం) సన్నవడ్లు, మరో 4.5 లక్షల ఎకరాల్లో విత్తన వెరైటీలు సాగు చేశారు. మిగిలిన 36 లక్షల ఎకరాల్లో పండిన సన్నాలు మార్కెట్‌కు వస్తాయి అనుకున్నా ఎకరాకు సగటున 22 క్వింటాళ్లు. ఈ లెక్కన 80 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉత్పత్తి రావాలి. రైతులు తిండి అవసరాలకు 10 లక్షల మెట్రిక్ టన్నులు ఇంట్లో పెట్టుకున్నా 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి రావాలి. ఈ లెక్కన 7 కోట్ల క్వింటాళ్లకు ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్ ఇచ్చినా రూ.35 వేల కోట్లు అవుతుంది. కేసీఆర్ ఇచ్చిన ఎకరాకు రూ.10 వేల రైతుబంధు ఇవ్వడం చేతగాని ప్రభుత్వం రూ.35 వేల కోట్ల బోనస్ ఎలా ఇస్తుంది?' అని నిరంజన్‌రెడ్డి నిలదీశారు. ఇప్పటివరకు రూ.20 కోట్లు బోనస్‌గా ఇచ్చినట్టు చెప్తూ తడిగుడ్డతో రైతుల గొంతు కోస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రాష్ట్రంలో ఇప్పటికే మూడు ఎన్‌కౌంటర్లు అయ్యాయి. ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ఆకునూరి మురళి ఎక్కడికి పోయారు? పదేండ్ల కేసీఆర్ పాలనలో లేని ఎన్‌కౌంటర్లు రాష్ట్రంలో మళ్లీ పునరుద్ధరించబడ్డాయా? ఈ ప్రభుత్వం ఏదో చేస్తుందన్న అపోహలు, భ్రమలను రైతులు, ప్రజలు పెట్టుకోవద్దు. అవకాశం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి' అని విజ్ఞప్తిచేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరసనలు, ఆందోళనలు తెలియజేస్తున్నదని చెప్పారు.

> **పారిశ్రామిక క్లస్టర్ల కోసం కేసీఆర్ ప్రభుత్వం గతంలో ప్రతి జిల్లాలో 400–500 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి పెట్టింది. ఇప్పటికే అక్కడ పలు మిల్లుల ఏర్పాటు కోసం కొందరు టీఎస్ఐపాస్‌కి దరఖాస్తు చేసుకున్నరు. రేవంత్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.** – నిరంజన్‌రెడ్డి

సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జనకు హాజరైన ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్, నాగరాజు, నాయకులు మందా జగన్నాథం, విజయరామారావు

బీఆర్ఎస్ పార్టీయే ప్రజలకు అండ

- మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- కాంగ్రెస్, బీజేపీ నుంచి 200 మంది బీఆర్ఎస్‌లో చేరిక

న్యూశాయంపేట, డిసెంబర్ 1: అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కష్టసుఖాల్లో బీఆర్ఎస్ పార్టీయే పాలుపంచుకుంటుందని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. హనుమకొండ 49వ డివిజన్ నాగేంద్రనగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు 200 మంది కంది యాదగిరి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు విష్ణువర్ధన్, రాజు అధ్యక్షతన ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు